సాక్షి
విశాఖపట్నం

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



భగ్గుమన్న ఉక్కు కార్మికులు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గేదిలేదన్న కేంద్రం తాజా వ్యాఖ్యలపై ఉక్కు కార్మిక సంఘాల భగ్గుమన్నాయి. IIలో




అప్రమత్తతే శ్రీరామరక్ష

జిల్లాలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం ఆ శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్ ప్రారంభించారు. IIలో



ఎట్టకేలకు వారణాసి రైలు

ఎంతో కాలంగా విశాఖ వాసులను ఊరిస్తున్న విశాఖపట్నం–వారణాసి రైలు ఈనెల 19 నుంచి పట్టాలెక్కనుంది. IIలో



ఆక్రమణలకు చరమ'గీతం'

- గీతం ఆక్రమణలపై మరోసారి అధికారుల చర్యలు
- రక్షిస్తున్న కొద్దీ కనిపిస్తున్న ఆక్రమిత భూములు
- గీతం చెరలో ఇంకా సుమారు 14 ఎకరాలున్నట్లు గుర్తింపు
- త్వరలోనే వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామన్న అధికారులు
- ప్రభుత్వ భూమి పరిరక్షణలో భాగంగానే చర్యలు



గీతం యూనివర్సిటీలో ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకొని అధికారులు ఏర్పాటు చేసిన కంచె

సాక్షి, విశాఖపట్నం : గీతం అక్రమాల కంచె క్రమక్రమంగా తొలగిస్తూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో టీడీపీ సర్కారు అండతో ప్రభుత్వ భూముల్లోనూ 'గీత' దాటి అక్రమ నిర్మాణాలు అడ్డగోలుగా నిర్మించేశారు. ఇప్పుడా కబ్జాల కంచెను తొలగించి రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా.. భీమిలి రెవెన్యూ బృందం గీతంపై చర్యలకు ఉపక్రమించింది. గతంలో స్వాధీనం చేసుకున్న రూ. కోట్ల భూములను పరిరక్షిస్తూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే ప్రక్రియను రెండో విడత పూర్తి చేసింది.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో భూ కుంభకోణాలపై చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటి వరకూ ఒకటి కాదు రెండు కాదు.. వేల కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి అధికారులు విడిపించారు. ఇందులో భాగంగా గీతం ఆక్రమణ చెరలో ఉన్న భూములను కూడా స్వాధీనం చేసుకున్నారు. 2020 అక్టోబర్ 24న ప్రభుత్వ భూముల్లో గీతం నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలను తొలగించిన రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న భూములు తిరిగి ఆక్రమణలకు గురి కాకుండా ఫెన్సింగ్ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో కొద్ది నెలల క్రితం రూ.190 కోట్ల విలువైన సర్వే నంబర్ 10,17,30లో మొత్తం 19.39 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ వలయం ఏర్పాటు చేశారు. తాజాగా శుక్రవారం మిగిలిన భూములకు సంబంధించిన చర్యలకు ఉపక్రమించారు. కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు తెల్లవారు జాము నుంచి భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ప్రారంభించారు. అధికారులు కంచె బిగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. 4.74 ఎకరాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు సర్వే చేసి వాటి హద్దులు ప్రకారం సర్వే నెంబరు 15, 16, 19, 20 లలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం ఆక్రమణలకు గురైన 40 ఎకరాల్లో ఇప్పటి వరకు దాదాపు 26 ఎకరాలు స్వాధీనం చేసుకొని రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. మరో 14 ఎకరాల ప్రభుత్వ భూమిని త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మిగిలిన ప్రభుత్వ భూమి హైకోర్టులో ఉన్నందున దాని ప్రకారం చర్యలు తీసుకుంటామని భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. కొత్తగా ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం కాదని, గతంలో స్వాధీనం చేసుకున్న భూముల్లోనే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

ముందస్తు చర్యల్లో భాగంగా...

అంబేడ్కర్ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనాల్సి ఉండటంతో.. త్వరితగతిన కంచె పనులు ఏర్పాటు చేసేందుకు వేకువ జామునుంచే చర్యలు ప్రారంభించారు. సెలవు రోజుల్లో ఈ తరహా పనులు పూర్తి చేస్తే సాధారణ విధులకు ఆటంకం కలగదన్న ఉద్దేశంతో అధికారులు భావించారు. అయితే గతంలో గీతం వద్ద ఆక్రమణలు తొలగించినప్పుడు, రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తున్న సమయంలో టీడీపీ శ్రేణులు విధులకు ఆటంకం కలగించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వ భూములు సంరక్షించేందుకు చేపడుతున్న చర్యలను రాజకీయం కోసం టీడీపీ వాడుకోవడంతో అధికార యంత్రాంగం ఇబ్బంది పడింది. శుక్రవారం ఈ తరహా ఇబ్బందులు ఎదురవ్వకుండా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకే పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నేత గండిబాబ్జీ గీతంలోకి వెళ్లి హడావిడి సృష్టించేందుకు యత్నించారు. అయితే అధికారులు వివరంగా చేపడుతున్న చర్యలను చెప్పడంతో.. చేసేదేమీ లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు గీతం ఆక్రమణలు నిజమేనని అర్థం చేసుకున్న స్థానిక టీడీపీ నేతలు అటువైపు కన్నెత్తికూడా చూడక పోవడం విశేషం.

ఇదీ గీతం ఆక్రమణల కథ

గత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 1998లో విశాఖ రూరల్ మండలం ఎండాడ సర్వే నంబరు 17/1 నుంచి 17/28 వరకు మొత్తం 71.15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరా రూ. 18 వేల ప్రకారం గీతం ఇన్‌స్టిట్యూట్‌కు బదలాయింపు చేసింది. అయితే బదలాయింపు చేసిన భూమిని కాకుండా చాలా ఏళ్లుగా అదనంగా సుమారు 38.60 ఎకరాలు ప్రభుత్వ భూమి అనధికారికంగా ఆక్రమించినట్లు అధికారులు గుర్తించారు. జనవరి 6వ తేదీన సర్వే నిర్వహించి సుమారు 19.39 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.



స్వాధీనం చేసుకున్న స్థలం చుట్టూ కంచె

తిరిగి శుక్రవారం 4.74 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుంది. ఇప్పటి వరకు 24.13 ఎకరాలు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా.. దీని విలువ సుమారు రూ. 300 కోట్లు ఉంటుందని అంచనా. మిగిలిన 14.47 ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా.. ప్రస్తుతం హైకోర్టులో ఉంది.

ఉష్ణోగ్రం



- 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఏప్రిల్‌లో ఇదే అత్యధికం
- మరో రెండ్రోజులు వడగాడ్పులు IIలో

న్యూస్‌రీల్

నేటి నుంచి విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్



పోటీలకు సిద్ధంగా రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్

విశాఖ స్పోర్ట్స్ : మూడుదశాబ్దాల విరామం అనంతరం విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు నగరంలో జరగనున్నాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈపోటీలకు రైల్వేస్టేడియం సిద్ధమైంది. ఈ ఆహ్వాన ఫుట్‌బాల్ ట్రోఫీలో 16 జట్లు నాలుగు పూల్స్‌లో తలపడనున్నాయి. ప్రతిరోజు రెండు మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనుండగా 23వ తేదీన ఫైనల్ జరగనుంది. విజేతకు లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు ప్రోత్సాహకాన్ని అందుకోనున్నారు. సునేబేడా, బ్లూస్టార్స్, మధ్యప్రదేశ్, ఏపీ, చెన్నై, విశాఖ, హైదరాబాద్, సిటీఎఫ్‌సీ, నాగపూర్, శ్రీధర్ స్పోర్టింగ్, ఎస్ఎఫ్ఎ, కోల్‌కతా, ఎస్ఏటీ, బర్గా, చత్తీస్‌గఢ్, డైమిమస్ ఫుట్‌బాల్ క్లబ్ జట్లు తలపడనున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో సునబేడా జట్టుతో బ్లూస్టార్స్ జట్టు తలపడనుంది. ఇప్పటికే ఇరుజట్లు విశాఖ చేరుకున్నాయి.


19, 21 తేదీల్లో జైలులో వేలం పాట

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో డెయిరీ ఫారంలో ఉన్న ఆవులు, గేదెలు, దూడలతో పాటు ఇక్కడున్న మామిడి చెట్ల పంటను వేలం వేయనున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెయిరీలో ఉన్న 22 మగ, ఆడ పశువులను ఈ నెల 19న కారాగారం ఆవరణలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 19న ఉదయం 10 గంటలకు జైల్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని ముందుగా రూ.1500 డిపాజిట్ చేయాలన్నారు. దీంతో పాటు జైలు ఆవరణలో ఉన్న మామిడి చెట్ల పంటకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జైల్ పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ వేలం వేయనున్నామన్నారు. మామిడి పంటను ఐదేళ్లకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సమయానికి వచ్చి రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు.

నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

అల్లిపురం (విశాఖ దక్షిణ): హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. శనివారం కరాస జంక్షన్ నుంచి మర్రిపాలెం, కంచరపాలెం మెట్టు, మహారాణి పార్లర్ జంక్షన్, దొండపర్తి, డైమండ్ పార్క్, ఐసీఐసీఐ బ్యాంక్ జంక్షన్, సీతమ్మపేట రోడ్డు, గురుద్వారా జంక్షన్, అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్టాపు, కృష్ణాకాలేజీ, ఇసుకతోట జంక్షన్, ఎంవీపీ డబుల్‌రోడ్డు, ఉషోదయ జంక్షన్, కామత్ హోటల్ జంక్షన్, కురుపాం సర్కిల్, పార్క్ హోటల్, బీచ్‌రోడ్డు జంక్షన్ మీదుగా కాళీమాత గుడి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. వాహనచోదకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని నగర ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సాహిత్య సంబరాలకు 'పిళ్లా'కు ఆహ్వానం



వెంకట రమణమూర్తి

సీతంపేట(విశాఖ ఉత్తర): తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌పీ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ సాహిత్య సంబరాలలో పాల్గొనాలని విశాఖకు చెందిన విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు పిళ్లా వెంకటరమణమూర్తికి ఆహ్వానం అందింది. రమణమూర్తి రచించిన కవిత సంకలనానికి ఎంపిక చేశామని, జాతీయ సాహిత్య సంబరాల సందర్భంగా విడుదల చేసే సంకలనంలో కవితను ప్రచురిస్తామని నిర్వాహకులు లేఖ ద్వారా తెలిపారు. సంకలనానికి ఎంపికైన కవులు, రచయితలకు సత్కారం, సాహిత్య పురస్కారం ప్రదానం చేయనున్నారు. జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో కవితా గానం చేసే అవకాశం కలిగిందని రమణమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో విప్లవాత్మక పాలన

- మహనీయుని ఆశయాలను అమలు చేస్తున్న సీఎం జగన్
- ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ. చిత్రంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు పండుల రవీంద్ర, వరుదు కల్యాణి తదితరులు

సాక్షి, విశాఖపట్నం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా పేదలు, దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనందిస్తున్నారని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కొనియాడారు. శుక్రవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి ఆయన పూలమాలలు వేసి అంబేడ్కర్‌కు నివాళు అర్పించారు. కేక్ కట్ చేసిన అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించి అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం పాటుపడుతున్నారన్నారు. మేయర్ గొలగాని వెంకట కుమారి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో విశాఖను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పండుల రవీంద్ర బాబు, వరుదు కల్యాణి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు జాన్‌వెస్లీ, కోలా గురువులు, శోభా స్వాతీ రాణి, పిల్లా సుజాత, పిల్లి సుజాత, నియోజకవర్గ పరిశీలకులు ఎస్.ఎ రెహ్మాన్, చొక్కాకుల వెంకటరావు, డీవీ సూర్యనారయణ రాజు, పళ్ల చిన్నతల్లి, కే.వి బాబా, ఆల్ఫాకృష్ణ, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, బి.కాంతారావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, పార్టీ ముఖ్యనాయకులు ఐ.హెచ్ ఫరూక్, వుడా రవి, అల్లంపల్లి రాజబాబు, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పేర్ల విజయ చందర్, నడింపల్లి కృష్ణంరాజు, మొల్లి అప్పారావు, సతీష్ వర్మ, బంగారయ్య, జోనల్ ఇన్‌చార్జులు సునీల్, తుళ్లి చంద్రశేఖర్, మారుతి ప్రసాద్, బి.పద్మావతి, జిల్లా అనుబంధ అధ్యక్షులు మాన్యాల శ్రీనివాస్, అప్పన్న, బొండా ఉమామహేశ్వరరావు, ఈశ్వర్ రావు, నమ్మి లక్ష్మణ్, కార్పొరేటర్లు బి.పి.ఎస్. కుమార్, కో ఆప్షన్ సభ్యులు ఎండీ షరీఫ్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీ దేవివర్మ, వెంకటలక్ష్మీ, యువశ్రీ, రాయుడు శ్రీను, చొక్కర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కరోనా కేసులు

మహారాణిపేట: విశాఖలో శుక్రవారం 13 కరోనా కేసులు నమోదయ్యాయి. గత కొద్ది రోజులుగా వరుసగా కేసులు పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. గడిచిన 24 గంటల్లో 272 మందికి పరీక్షలు నిర్వహించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 35కు చేరుకుంది. కరోనా సోకిన వారిలో 12 మంది డిశ్చార్జ్ కాగా..35 మంది చికిత్స పొందుతున్నారు. 32మంది హోం ఐసోలేషన్ ఉండగా, ముగ్గురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

మోడరన్ ఫిష్ మార్కెట్ రెడీ

- హార్బర్‌లో రూ.2.75 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 1,600 గజాల విస్తీర్ణంలో 120 సీట్ల సామర్థ్యం
- డిస్‌ప్లే టేబుళ్లు, కటింగ్, సింక్ ట్యాప్‌లు ఏర్పాటు
- ఇకపై పూర్తి పరిశుభ్ర వాతావరణంలో చేపలు లభ్యం
- వేట విరామం తర్వాత నుంచి చేపల అమ్మకాలు ప్రారంభం



ఫిష్ మార్కెట్ లోపల ఏర్పాటు చేసిన డిస్‌ప్లే టేబుళ్లు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్ రాష్ట్రంలోనే అతి పెద్ద చేపల రేవు. 1976లో ఏర్పాటైన ఈ హార్బర్ 64 ఎకరాల్లో విస్తరించి ఉంది. నిత్యం కొనుగోలు, అమ్మకందార్లతో కళకళలాడుతూ ఉంటుంది. అయితే చేపల క్రయవిక్రయాలకు సరైన సదుపాయం లేక ఏళ్ల తరబడి ఈ హార్బర్ అపరిశుభ్ర వాతావరణంతో సతమతమవుతోంది. ఎండ, వానల్లోనూ ఆరుబయటే జెట్టీపై బహిరంగంగా చేపల అమ్మకాలు, కొనుగోళ్లు జరపాల్సి వస్తోంది. ఇది ఇటు వర్తకులతో పాటు రిటైల్ కొనుగోలుదార్లకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ చేపల రేవులో అధునాతన ఫిష్ మార్కెట్ నిర్మాణాన్ని సంకల్పించింది. ఇందుకోసం రూ.2.75 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో 1,600 గజాల విస్తీర్ణంలో 120 సీట్ల సామర్థ్యం ఉండే మోడరన్ ఫిష్ మార్కెట్ సిద్ధమైంది. ఇటీవలే దీని నిర్మాణం పూర్తయింది. చేపలవేట విరామం పూర్తయ్యాక జూన్ 15 తర్వాత నుంచి ఈ కొత్త మార్కెట్ అందుబాటులోకి రానుంది.

ఫిష్ మార్కెట్లో సదుపాయాలివీ.. : ఈ అధునాతన ఫిష్ మార్కెట్లో పలు సదుపాయాలున్నాయి. విక్రయించే చేపలను ఉంచడానికి డిస్‌ప్లే టేబుళ్లను అమర్చారు. ప్రతి స్టాల్‌కు సింక్ ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. ఇంకా చేపలను కోయడానికి వీలుగా కటింగ్ సదుపాయాన్ని కల్పించారు. చేపలు విక్రయించే వారు, కొనుగోలు చేసే వారి కోసం మంచినీరు, విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు. అంతేకాదు.. ఈ ఆధునిక చేపల మార్కెట్లో కూర్చునేందుకు వీలుగా కుర్చీలను సమకూర్చాలని విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యాన్ని మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే కోరారు. ఇందుకు ఆ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ఈ మోడరన్ ఫిష్ మార్కెట్ అందుబాటులోకి వస్తే హార్బర్‌లో పరిశుభ్రమైన వాతావరణంలో చేపల క్రయవిక్రయాలు జరగడానికి వీలుంటుందని, దీనివల్ల నాణ్యత పెరుగుతుందని జిల్లా మత్స్య శాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

బోట్ల వివరం	రిజిస్టరైనవి	నడుస్తున్నవి
మెకనైజ్డ్ బోట్లు	696	626
మోటారైజ్డ్ బోట్లు	450	405
బీచ్ ల్యాండింగ్ క్రాఫ్ట్స్ (బీఎల్‌సీ)	15	13
నాన్ మోటారైజ్డ్ సంప్రదాయ బోట్లు	150	135
మొత్తం	1,311	1,179

రూ.182 కోట్లతో ఆధునికీకరణ

విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను సాగరమాల పథకంలో రూ.182 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ చేపడుతున్నారు. ఇటీవలే వీటి పనులు కూడా మొదలు పెట్టారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లో నివేదించిన ప్రకారం.. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 1,311 వరకు వివిధ రకాల బోట్లున్నాయి. వీటిలో మరబోట్లు 696, మోటారైజ్డ్ బోట్లు 450, బీచ్ ల్యాండింగ్ క్రాఫ్ట్స్ (బీఎల్‌సీలు) 15, సంప్రదాయ బోట్లు (నాటు పడవలు) 150 ఉన్నాయి. వీటిలో 1,179 వరకు వేట సాగిస్తున్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున ఈ చేపల రేవుకు 150 టన్నుల చేపలు వస్తున్నాయి. రోజుకు 33 ట్రక్కుల చొప్పున నెలకు వెయ్యి ట్రక్కుల్లో చేపల రవాణా జరుగుతోంది. రోజుకు 135 ద్విచక్ర వాహనాలు, 15 నాలుగు చక్రాల వాహనాలు వస్తుంటాయి.

ఎట్టకేలకు పట్టాలపైకి వారణాసి రైలు

తాటిచెట్లపాలెం: ఎంతో కాలంగా విశాఖ వాసులను ఊరిస్తున్న విశాఖపట్నం-వారణాసి రైలు వచ్చే బుధవారం (19 నుంచి) పట్టాలెక్కనుంది. ఈ మేరకు వాల్తేర్ డివిజన్ అధికారులు ఈ వీక్లీ స్పెషల్ వివరాలు తెలియజేశారు. త్వరలో రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నం-వారణాసి(08588) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖలో ప్రతీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరుతుంది. ఈ స్పెషల్ రైలు ఏప్రిల్ 19, 26, మే 3, 10, 17 తేదీల్లో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో వారణాసి-విశాఖపట్నం(08587) వీక్లీ స్పెషల్ ప్రతీ గురువారం సాయంత్రం 6 గంటలకు బయల్దేరుతుంది. ఈ రైలు ఏప్రిల్ 20, 27, మే 4, 11, 18 తేదీల్లో నడుస్తుంది. ఈ స్పెషల్ రైలు ఇరుమార్గాల్లో సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, కేసింగ, టిట్లాఘడ్, బాలంగీర్, బార్‌గడ్ రోడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, బారకకన, లతేహర్, దల్తోంగంజ్, గార్వారోడ్, డిహ్రీ ఆన్‌సన్, ససరం, భబువరోడ్, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్లలో ఆగుతుంది. ఈ స్పెషల్ రైళ్లు 1-సెకండ్ ఏసీ, 3-థర్డ్ ఏసీ, 12-స్లీపర్ క్లాస్, 2-జనరల్ సెకండ్ క్లాస్, 2-సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగ్ కోచ్‌లతో నడుస్తుంది.

నేటి నుంచి హై లైఫ్ ఎగ్జిబిషన్

బీచ్‌రోడ్డు: సమ్మర్ స్పెషల్‌గా శని, ఆదివారాల్లో బీచ్ రోడ్డులోని నోవాటెల్‌లో హై లైఫ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దేశంలో ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు, ఆభరణాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెళ్లి వస్త్రాలు ఎగ్జిబిషన్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వెల్లడించారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

భగ్గుమన్న ఉక్కు కార్మికులు

- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- కూర్మన్నపాలెం హైవేపై ఉద్రిక్తత



కార్మికుల ఆందోళనతో జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గేదిలేదన్న కేంద్రం తాజా వ్యాఖ్యలపై ఉక్కు కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. కేంద్ర మంత్రిత్వ శాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేదిలేదని చెప్పడంపై కార్మికులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు రోడ్డెక్కారు. కూర్మన్నపాలెం కూడలిలోని జాతీయ రహదారిపై శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఆందోళనకు దిగిన కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించడంతో.. కార్మికులు ప్రతిఘటించారు. దీంతో హైవేపై కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే ఎంతకైనా పోరాడతామని ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన కార్మిక సంఘాల నాయకులను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి. ప్రైవేటీకరణ అంశంపై మాట మార్చడం సరికాదు. కార్మికులు ఆందోళనకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. మొదట స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించి తర్వాత మాట మార్చారు.

– ఆదినారాయణ, పోరాట కమిటీ చైర్మన్

అప్రమత్తతే శ్రీరామరక్ష

- అగ్నిమాపక సేవల శాఖ డీజీ సునీల్‌కుమార్
- అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

అల్లిపురం: జిల్లాలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా ఆయన అగ్నిమాపక సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్, అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక శకటాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డాబాగార్డెన్స్, అంబేడ్కర్ సర్కిల్, సంగం శరత్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలమెట్ట, సౌత్ జైలురోడ్డు, జగదాంబ, టర్నల్ చౌల్ట్రీ మీదుగా తిరిగి సూర్యాబాగ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అగ్ని ప్రమాదాల వేళ.. అప్రమత్తతే శ్రీరామరక్ష అని పిలుపునిచ్చారు. ప్రాంతీయ అగ్నిమాపక అధికారి, జోన్-1 ఎస్.నిరంజన్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.కె.రమణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీజీ పీవీ సునీల్‌కుమార్, ఆర్‌ఎఫ్‌వో నిరంజన్‌రెడ్డి, డీఎఫ్‌వో మోహనరావు

అంబేడ్కర్ అడుగు జాడల్లో...



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ కల్యాణి, కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్



అంబేడ్కర్ భవన్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

డాబాగార్డెన్స్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు గొప్పవని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. డాబాగార్డెన్స్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆమెతో పాటు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన అడుగు జాడల్లో నడుస్తూ.. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యుదయానికి బాబా సాహెబ్ చేసిన కృషి ఎనలేనిదన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

సీతంపేట: భారత దేశంలోనే కాక అనేక దేశాల్లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన ప్రపంచ మేధావి అని విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ కొనియాడారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆధునికీకరించిన గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చిన అంబేడ్కర్ దేశ అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి చేరడం మనందరికీ గర్వకారణమన్నారు. అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, ఇన్‌కంటాక్స్ డిప్యూటీ కమిషనర్ డి.సుందరరావు, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళులు

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ జి.గంగాధర్, అడ్మిన్ ఏడీసీపీ ఎం.ఆర్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్



విద్యార్థులకు లాప్‌ట్యాప్ అందజేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్, ఏజీఎం సురేష్

విశాఖ విద్య: విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.కృష్ణమోహన్ అన్నారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చాటుకున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులకు శుక్రవారం రామ్‌నగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో అభినందన సభ జరిగింది. ఒలింపియాడ్‌లో సత్తా చాటిన ఆరుగురు విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు, 23 మందికి ట్యాబ్‌లను రిజిస్ట్రార్ అందించారు. ముందుగా డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యా సంస్థల ఏజీఎం ఎం.వి.సురేష్ మాట్లాడుతూ చదువుపై శ్రద్ధ వహించే విద్యార్థులు లక్ష్యసాధనలో ముందుంటారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. సంస్థ కోఆర్డినేటర్లు లెంక రాజేష్, బాలరాజు, వెంకటరమణ, శైలజ, ఏవో వి.ఉదయశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిల్క్ ఎక్స్‌పోకు విశేష స్పందన

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోకు నగర వాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం ప్రారంభమైన ఈ ఎక్స్‌పోలో దేశ వ్యాప్తంగా పేరుగాంచిన చీరలు, వస్త్రాలను అందుబాటులో ఉంచారు. మగువల అందాలను రెట్టింపు చేసే ప్రత్యేకమైన ఆభరణాలను ప్రదర్శించారు. సోమవారం వరకు సాగే ఈ ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



చీరను పరిశీలిస్తున్న యువతి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక

సీతంపేట: గాంధీ హరిజన సేవా సంఘం అధ్యక్షుడు జోరీగల గణేష్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. నియోజకవర్గ సమన్వయకర్త, సెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు వారందరికీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 సీట్లలో పార్టీని గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన హరిజన సంఘం ప్రతినిధులు జోరీగల గణేష్, జోరీగల కనకరాజు, గంట్యాడ కనకరాజు, మహిళా నాయకులు సిహెచ్.భవాని, పెద్దాడ సుధ, చిన్ని యాత సంఘం నాయకులు లక్ష్మయ్య, కాపు నాయకులు రామకృష్ణలకు పార్టీ కండువాలు వేశారు. టీడీపీకి మద్దతుగా ఉన్న వీరంతా ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, ముప్పల పోలారావు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, సంపంగి శ్రీనివాసరావు

స్కూటీ రంగులు మార్చి.. గొలుసు దొంగతనాలు

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- 116.2 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



పోలీస్ సిబ్బందికి క్యాష్ రివార్డులు అందజేస్తున్న క్రైం డీసీపీ జి.నాగన్న

అల్లిపురం: బండిని దొంగిలించి.. దాని రంగులు మార్చి.. గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఒకరిని క్రైం పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 116.2 గ్రాముల బంగారు ఆభరణాలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. సూర్యాబాగ్‌లోని నగర పోలీస్ కమిషనర్ సమావేశ మందిరంలో క్రైం డీసీపీ గంధం నాగన్న ఈ వివరాలు వెల్లడించారు. గతేడాది అక్టోబర్ 5న దసరా పండగ రోజు సాయంత్రం 7 గంటల సమయంలో మురళీనగర్‌కు చెందిన తెలగపూడి పద్మావతి రామాలయం నుంచి తన ఇంటికి వెళుతున్నారు. ఆ సమయంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామానికి చెందిన దుక్కా జయరామ్ స్కూటీపై వచ్చి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు నల్లపూసల దండను లాక్కొని వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- ఈ ఏడాది మార్చి 21న మురళీనగర్‌కు చెందిన పొన్నాడ అమ్మాజీ బర్మా క్యాంప్ నూకాలమ్మ గుడి నుంచి మురళీనగర్ నడుచుకుని వెళుతున్నారు. పట్టాభిరెడ్డి తోట ప్రాంతంలో నిందితుడు స్కూటీపై వచ్చి ఆమె మెడలో ఆరు తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండ లాక్కొని వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో క్రైం డీసీపీ గంధం నాగన్న ఆదేశాలతో క్రైం ఏడీసీపీ డి.గంగాధరం, క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు ఉత్తర్వుల మేరకు వెస్ట్ క్రైం సీఐ కె.దుర్గాప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.సునీల్ సారథ్యంలో రెండు బృందాలు ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గురువారం కైలాసపురం ప్రాంతంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి దొంగిలించిన సొత్తు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

అప్పుల బాధ తట్టుకోలేక..

నిందితుడు దుక్కా జయరామ్ కుమారుడు అనారోగ్యం, అప్పుల బాధల నుంచి విముక్తి పొందేందుకు చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో బంగారు ఆభరణాలు దొంగతనం చేయాలని నగరానికి వచ్చాడు. కంచరపాలెం పరిధిలో రెండు, గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఒక స్కూటీ దొంగతనం చేశాడు. ముందుగా స్కూటీ దొంగతనం చేసి.. చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. తర్వాత స్కూటీ రంగు, నంబర్ ప్లేట్ మార్చి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు క్రైం డీసీపీ నాగన్న తెలిపారు.

సిబ్బందికి క్యాష్ రివార్డులు

నిందితుడిని సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకోవడంతో పాటు సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ కె.దుర్గాప్రసాదరావు, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి క్రైం ఎస్ఐలు ఎస్.సునీల్, ఎస్.నరసింహరాజు, ఎం.డి.సల్మాన్ ఖాన్, క్రైం కానిస్టేబుళ్లు పి.గణేష్, జీవీవీ కిశోర్, ఎస్.ఎస్.బి.నవీన్‌కుమార్, వై.శివకుమార్, పి.పైడిరాజు, వై.శివ, ఎస్.రవిబాబులకు క్రైం డీసీపీ జి.నాగన్న క్యాష్ రివార్డులు ప్రదానం చేసి.. అభినందించారు.

ఉష్ణోగ్రం



సాక్షి, విశాఖపట్నం: విశాఖలో ఉష్ణోగ్రతల ఉధృతి తగ్గడం లేదు. పైగా రోజురోజుకు ఉష్ణతాపం ఉగ్రరూపం దాలుస్తూనే ఉంది. ఫలితంగా వడగాడ్పులు కొనసాగుతున్నాయి. గడచిన నాలుగు రోజులుగా ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 4-6 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. తాజాగా శుక్రవారం నగరంలో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది సాధారణంకంటే 6.1 డిగ్రీలు అధికమన్న మాట! రాష్ట్రంలో సాధారణంకంటే అధికంగా కాకినాడ జిల్లా తునిలో 6.8 డిగ్రీలు అధికంగా నమోదు కాగా విశాఖ ఆ తర్వాత స్థానంలో నిలిచింది. వాస్తవానికి సాధారణంకంటే 4.5 నుంచి 6 డిగ్రీలు ఎక్కువ రికార్డయితే వడగాడ్పులు, 6 డిగ్రీలకు మించి నమోదైతే తీవ్ర వడగాడ్పుల గాను పరిగణిస్తారు. ఈ లెక్కన శుక్రవారం నాటి ఉష్ణోగ్రతలు తీవ్ర వడగాడ్పులకు దారి తీశాయి. ఉదయం పది గంటల సమయం నుంచే మొదలైన భానుడి ప్రతాపం సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. దీంతో శుక్రవారం విశాఖ నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంత వాసులు వడగాడ్పుల ధాటికి విలవిల్లాడిపోయారు. ఎండ, వేడి గాలుల నుంచి ఉపశమనం పొందడానికి జనం ఇబ్బందులు పడ్డారు. కాగా శుక్రవారం నమోదైన 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత ఏప్రిల్ నెలలోనే రికార్డుగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మునుపెన్నడూ ఏప్రిల్‌లో ఇంతటి తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కాలేదని అంటున్నారు. మరో రెండ్రోజుల పాటు ఉష్ణోగ్రతల పెరుగుదల కొనసాగుతుందని, వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



పెంద్ర చిన్నోడు మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయకుండా అతని అంత్యక్రియలను భార్య, బంధువులు చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. హైస్కూల్ రోడ్డు, చింతాలమ్మకాలనీకు చెందిన పెంద్ర చిన్నోడు(45) చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వంటివి సేకరించి స్క్రాబ్ దుకాణంలో విక్రయిస్తుంటాడు. అతనికి భార్య బోడమ్మ, పిల్లలు సందీప్, సంతోష్, చిన్నా, కవిత ఉన్నారు. భార్య, పిల్లలు బంధువుల ఇంటికి వెళ్లగా.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత అతను ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చిన భార్య.. భర్త చనిపోవడం చూసి షాక్‌కు గురైంది. బంధువుల సహకారంతో మృతదేహాన్ని దించి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం పోలీసులు సమాచారం అందడంతో సీఐ ఎల్.భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకుని చిన్నోడు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. భార్య, ఇరుగుపొరుగు వారి నుంచి వివరాలు సేకరించారు. కాగా చిన్నోడికి మద్యం సేవిస్తుంటాడు. అప్పులు ఉన్నాయి. వారం రోజుల నుంచి సరిగా భోజనం సరిగా చేయడం లేదని, పనులకు వెళ్లడం లేదని భార్య తెలిపింది. భర్త మృతదేహాన్ని పోస్టుమార్టం చేస్తారనే కారణంతోనే పోలీసులకు విషయం తెలపలేదని చెప్పింది. పోలీసులు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.